నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చార్మినార్ సీబీడీ ఏడీఈ తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కింది ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. హైదర్‌గూడ, నలందానగర్, వెంకటేశ్వర ఎన్‌క్లేవ్, డాక్టర్ కాలనీ, సిరిమల్లేనగర్, లోటస్ స్కూల్, ప్లేసంట్ పార్కు, న్యూ ఫ్రెండ్స్ కాలనీ, లక్ష్మీనగర్, వాసుదేవిరెడ్డి నగర్, సంజీవని హిల్స్, ఏజీ కాలనీ, ఈశ్వర్ థియేటర్, గాంధీబొమ్మ, కాంటరెడ్డి నగర్, రాధాకృష్ణనగర్, అంబియన్స్ ఫోర్ట్, జనప్రియ అపార్ట్‌మెంట్, కేశవ్‌నగర్, కృష్ణానగర్, శివనగర్, మోర్ సూపర్ మార్కెట్, గుమ్మకొండ కాలనీ, సోమిరెడ్డి నగర్, నందనవనం, గోల్డెన్ ప్యాలెస్, అత్తాపూర్, వీకర్ సెక్షన్ కాలనీ, ఖాజానగర్, రాంబాగ్, తేజస్వీనగర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏడీఈ వివరించారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

మణికొండ: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌లకు నార్సింగి మున్సిపాలిటీ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో కౌన్సిలర్‌లు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం వారిని వారి నివాసాల్లో కలిసి సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు పత్తి ప్రవీణ్‌కుమార్, జి.అమరేందర్‌రెడ్డి, పత్తి శ్రీకాంత్, కె.నరేష్ పాల్గొన్నారు.

హుస్సేన్ నాయక్‌ను కలిసిన బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: నగరంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన జాతీయ గిరిజన కమిషన్ బోర్డు సభ్యులు హుస్సేన్ నాయక్‌ను రాజేంద్రనగర్‌లో బీజేపీ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్కా నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, యువమోర్చా నాయకుడు బాల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జి.బాబురావు, డివిజన్ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు ప్రకాశ్, డి.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బిల్‌కలెక్టర్ మృతి



మహబూబ్ పాషా

మణికొండ: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నార్సింగి బిల్ కలెక్టర్ గురువారం మృతి చెందాడు. వివరాలివీ... సిద్దిపేట జిల్లాకు చెందిన మహబూబ్ పాషా (50) వట్టినాగులపల్లి గ్రామపంచాయతీగా ఉన్నప్పటి నుంచి ప్రస్తుత నార్సింగి మున్సిపాలిటీ వరకు బిల్‌కలెక్టర్‌గా పనిచేశారు. అతనికి బ్రెయిన్ ట్యూమర్ రావటంతో గతంలో రెండు సార్లు శస్త్ర చికిత్సలు జరిగాయి. తిరిగి నెల రోజుల నుంచి హైటెక్‌సిటీలోని యశోదా ఆస్పత్రిలో మహబూబ్ పాషా చికిత్స పొందుతున్నారు. గురువారం పరిస్థితి విషమించటంతో అతను మృతి చెందాడు. మహబూబ్ పాషాకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. అతని మృతితో నార్సింగి మున్సిపల్ కార్యాలయం, వట్టినాగులపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తోటి బిల్‌కలెక్టర్‌లు ఆస్పత్రికి వెళ్లి అతన్ని కడసారి చూసి నివాళులు అర్పించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల విజేత వైష్ణవి

రాయదుర్గం: హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ 7వ తరగతి విద్యార్థినికి యోగా పోటీలలో ప్రథమ స్థానం లభించింది. సీఎం కప్ అండర్-14 రిథమిక్ యోగా విభాగంలో వైష్ణవి సత్తా చాటింది. రంగారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తూ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్నారు. మొదటిస్థానంలో నిలవడంపై క్యాంపస్ స్కూల్ ప్రిన్సిపల్ మురళి సంతోషం వ్యక్తం చేశారు. వైష్ణవికి శిక్షణ ఇచ్చిన స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ యోగా ఇన్‌స్ట్రక్టర్ మట్టపల్లి సతీష్‌ను అభినందించారు.

మార్కెట్లు లేక పరేషాన్

- ఆగిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణం
- నార్సింగి, పీరంచెరువులలో పునాదులకే పరిమితం
- మణికొండలో కోర్టు వివాదంలో భూమి
- శంషాబాద్‌లో జరగని భూ కేటాయింపు
- పట్టించుకోని పాలకుల తీరుపై సర్వత్రా ఆగ్రహం



నార్సింగిలో నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు

మణికొండ: విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగర శివార్లలోని రాజేంద్రనగర్ నియోజకవర్గం రూపు రేఖలు వేగంగా మారిపోతున్నాయి. నార్సింగి, మణికొండ, శంషాబాద్ మున్సిపాలిటీలతో పాటు బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌ల పరిధిలో గేటెడ్ కమ్యూనిటీలు, టవర్‌లు, అపార్ట్‌మెంట్‌లు వందలాదిగా వెలుస్తున్నాయి. వాటిల్లో ప్రతి సంవత్సరం వేలాది కుటుంబాలు వచ్చి చేరుతున్నాయి. వారందరికీ సమీపంలో ఎక్కడా కూరగాయలు, మాంసం, చేపలను కొనుగోలు చేసేందుకు అనువైన మార్కెట్‌లు లేవు. కూరగాయలకు వెళ్లే మెహిదీపట్నంలోని రైతుబజార్ లేదంటే రోడ్ల పక్కన ఏర్పాటు చేసే షాపులు, వారాంతపు సంతలను ఆశ్రయిస్తున్నారు. దేశ, విదేశాలకు చెందిన వారు నివాసం ఉంటున్న మున్సిపాలిటీలలో స్థానికంగా ప్రజలకు సరైన మార్కెటింగ్ సౌకర్యాలు లేక రాష్ట్రంలో ఇదేమి పరిస్థితని వారు తిట్టుకుంటున్నారు.

– చికెన్ షాపులు మాత్రం ప్రజలకు ఎక్కడపడితే అక్కడ అందుబాటులో ఉండటం, మిగతా మాంసం, చేపలు, కూరగాయల మార్కెట్‌లు అందుబాటులో లేకపోవటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెరుగుతున్న జనాభాకు అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలను కల్పించాల్సిన ప్రభుత్వాలు వాటిని పట్టించుకోకపోవటంతో ప్రజలు నాణ్యతలేని ఆహార పదార్థాలను అధిక ధరలకు కొనుగోలు చేసి నష్ట పోతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో మొదలైనా...

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రతి మున్సిపాలిటీలో కూరగాయలు, మాంసకృత్తులు అన్నీ ఒకే చోట లభించేలా సమీకృత మార్కెట్ (ఇంటిగ్రేటెడ్)లను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. దాంతో నార్సింగి, మణికొండ, పీరంచెరువులలో వాటిని ఏర్పాటు చేసేందుకు అవసరమైన భూములతో పాటు రూ. 4.50 కోట్ల చొప్పున నిధులను కేటాయించింది.

- అంతలోనే ఎన్నికలు రావటం... ప్రభుత్వం మారటంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. వాటికి ప్రస్తుత ప్రభుత్వంలో నిధులు విడుదల కాకపోవటం, వాటిని రప్పించేలా ప్రజాప్రతినిధులు కృషి చేయకపోవటంతో పుట్టింగ్‌ల స్థాయిలోనే నిలిచిపోయాయి. దాంతో నార్సింగి, పీరం చెరువులలో గుంతలు ప్రమాదకరంగా మారాయి. పిల్లలు ఆ గోతులలో పడే అవకాశం ఉందని, పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.
- మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని సర్వే నెంబర్ 65లో ఎకరం భూమిని కేటాయించగా అది కోర్టు వివాదంలో పడింది. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న శంషాబాద్‌లో పెద్ద షాపూర్ కేంద్రంగా నార్సింగి మార్కెట్ కమిటీకి 20 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించి కూరగాయల మార్కెట్‌ను అభివృద్ధి చేయాలని అప్పట్లో నిర్ణయించారు. ఆ పనులు ప్రాతిపాదనల స్థాయిలోనే నిలిచిపోయాయి.



సత్వరమే పూర్తి చేయాలి



పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నిత్యావసరరాల మార్కెట్‌లు అందుబాటులో లేవు. పేదలకు నిత్యావసరాలతో పాటు మాంస కృత్తులు కొనాలంటే తీవ్ర ఇబ్బంది అవుతుంది. నార్సింగిలో ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు మధ్యలో నిలిచిపోవటంతో ప్రమాదకరంగా మారాయి. వాటిల్లో పిల్లలు పడే ప్రమాదం ఉంది. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే నిధులను కేటాయించి పనులను పూర్తి చేసి ప్రజలకు మంచి మార్కెట్‌ల సౌకర్యాన్ని కల్పించాలి.

– షేక్ ముక్తార్ పాషా, నార్సింగి

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మార్కెట్‌లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే మున్సిపాలిటీ వారీగా కేటాయించిన స్థలాలలో వాటిని పూర్తి చేయాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కోరతాము. శంషాబాద్‌లో కూరగాయల మార్కెట్ అభివృద్ధికి భూమిని కేటాయించాలని కోరతాము. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ల నిర్మాణం పూర్తి కాగానే వాటిని నార్సింగి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలోకి తేవాలని కోరతాం.

– కె.వేణుగౌడ్, చైర్మన్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్

సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం కావాలి



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలిసిన నాగేందర్‌రెడ్డి

అత్తాపూర్: పార్టీ శ్రేణులందరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండకళ్ల నాగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షులు చందుయాదవ్, ఆకాష్‌కుమార్, రాజేంద్రనగర్ మండల అధ్యక్షుడు మహేష్‌కుమార్, నార్సింగి మండల అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, బండ్లగూడ కార్పొరేషన్ అధ్యక్షుడు అజయ్, నేతలు హరీష్‌రెడ్డి, బబ్లు ముదిరాజ్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మున్సిపల్ కార్మికురాలి మృతి



కార్మికురాలు లక్ష్మమ్మ (ఫైల్)



నివాళులు అర్పిస్తున్న నాయకులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ కార్మికురాలిగా పనిచేస్తున్న గంగని లక్ష్మమ్మ(65) గురువారం మృతి చెందారు. ఆమె మరణం విషయం తెలుసుకున్న పలువురు నాయకులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్, సీనియర్ నాయకులు దప్పు ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి తదితరులు లక్ష్మమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి అయినా మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోవడం దుర్మార్గం అన్నారు. కార్మికులు మరణిస్తే దహన మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 50 వేలను తక్షణ సాయంగా కుటుంబానికి అందజేయాలన్నారు. కార్మికులకు రూ. 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. మున్సిపల్ విభాగం ఉపాధ్యక్షులు సురేష్, నవీన్, కోశాధికారి నరేందర్, సి.హెచ్.వెంకటేష్, జగన్‌మోహన్‌రావు, మల్లేష్, సుభాష రామాంజనేయులు, శ్రీధర్, తౌఫిక్, కృష్ణ, సి.హెచ్.రాము, లక్ష్మీనారాయణ, కార్మికులు భారతమ్మ, అంజమ్మ, పార్వతమ్మ, స్వరూప, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీలు ప్రారంభం



చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అత్తాపూర్: ఎత్తుకు పై ఎత్తు వేస్తేనే చదరంగంలో రాణించగలరని రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు ఎం.ప్రభాకరాచారి, ప్రధాన కార్యదర్శి జి.శరవణ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. మండల స్థాయి అంతర ప్రైవేట్ పాఠశాలల క్రీడోత్సవాల్లో భాగంగా గురునానక్ స్కూల్‌లోని దర్మేష్ ఆడిటోరియంలో సబ్ జూనియర్, జూనియర్ విభాగాల చెస్ క్రీడా పోటీలను గురువారం జిల్లా సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ ఎ.యాదగిరి, మండల సంఘం కోశాధికారి ఎస్.ఆర్.రజనీకాంత్, క్రీడలు, సాంస్కృతిక విభాగం కార్యదర్శులు వేణుగోపాల్, బోయ లక్ష్మణ్‌లతో కలిసి ప్రారంభించారు. చదరంగం ఆటపై విజ్ఞాన పరిజ్ఞానం కలిగి ఉండటంతో పాటు వ్యూహాత్మక ఎత్తులు వేయాలన్నారు. వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు రాజేంద్రప్రసాద్, కరుణాకర్, మధుసూదన్, మహ్మద్ వాజిద్, శేషు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్ల పంపిణీ



సంబరాల్లో పాల్గొన్న కుమారస్వామి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని నవ యువ యూత్ క్లబ్ 23వ వార్షికోత్స వేడుకలు గురువారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేసి పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి మాట్లాడుతూ... రెండున్నర దశాబ్దాలుగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ కాలనీల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తున్నామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.శంకర్ మాట్లాడుతూ... క్లబ్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పాఠశాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరింత ప్రోత్సహించాలన్నారు. క్లబ్ సభ్యులు పాఠశాల సమస్యలను చర్చించారు. సమస్యల పరిష్కారం కోసం క్లబ్ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, సహాయ కార్యదర్శి కొంపల్లి జగదీష్, రాజు, కె.కృష్ణారెడ్డి, కిషోర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుడా కాలనీలో క్రీడా పోటీలు

మణికొండ: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మణికొండ హుడాకాలనీలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, సర్దార్ పటేల్ పార్క్ వాక్ మేట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రామానుజం పోటీలను ప్రారంభించారు. క్రీడలు శారీరక, మానసిక ఉత్సాహాన్ని ఇస్తాయని, ప్రతి ఒక్కరూ తమ దిన చర్యలో క్రీడలను భాగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రధాన కార్యదర్శి టి.రమేష్‌బాబు, ఎంప్లాయిస్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెంటారెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు సి.బీరప్ప, కో ఆప్షన్ సభ్యుడు జె.సిద్దప్ప, నాయకులు ఎం.రాఘవరెడ్డి, కాలనీల నాయకులు సుగుణరాజు, విష్ణు, రామకృష్ణ, భాస్కర్, మీరావళి అజార్, లక్ష్మణ్, షాకీర్ అలీ, ఇక్బాల్, రాజేందర్, మహేష్, కృష్ణకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇరుముడి కట్టు.. శబరిమలకు...



శబరిమలకు బయలుదేరిన అయ్యప్పలు

మణికొండ: భక్తి శ్రద్ధలతో అయ్యప్ప మాల ధరించి 40 రోజుల పాటు కఠోర దీక్షను పూర్తి చేసుకున్న అయ్యప్ప స్వాములు ఇరుముడులు కట్టుకొని శబరిమలకు బయలుదేరి వెళ్లారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రం సన్నిధానం అయ్యప్ప మాల ధారులు గురువారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె. అశోక్ యాదవ్ నివాసంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజలో పాల్గొన్నారు. భక్తి పాటలతో ఆయ్యప్పను కీర్తించి 18 మెట్ల మహా పడిని కాల్చారు. అనంతరం వారంతా లక్ష్మమ్మ దేవాలయ ఆవరణలో గురుస్వాముల నేతృత్వంలో ఇరుముడులు కట్టుకుని శబరిమలకు వెళ్లారు. వారికి స్థానిక నాయకులు అశోక్‌యాదవ్‌తో పాటు బంధుమిత్రులు వీడ్కోలు పలికారు.

అంధకారంలో పోర్ట్‌వ్యూ కాలనీ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని పోర్ట్ వ్యూ కాలనీలో వీధి దీపాలు వెలగక స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మూడు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలకు మరమ్మతులు నిర్వహించడంతో పాటు కొత్తవి ఏర్పాటు చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ సహా వీధి దీపాల నిర్వహణ అధికారులను కలిసి వినతిపత్రం అందజేసినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో చీకటిని ఆసరాగా చేసుకొని స్థానికంగా చిల్లర దొంగతనాలు జరుగుతున్నాయని వాపోయారు. సాయంత్రం అయిందంటే చాలు ఇళ్ల నుంచి చిన్నారులు, వృద్ధులు, మహిళలు బయటికి వెళ్లేందుకు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే వీధి దీపాలను ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నారు.

దొంగిలించిన బైక్‌పై వెళ్తూ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్: దొంగిలించిన బైక్‌పై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలివీ... నర్సింహా అనే వ్యక్తి(40) గత నెల 29న ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్‌ను దొంగిలించాడు. అదే రోజు శ్రీనివాస్ అనే వ్యక్తితో కలిసి ఇద్దరు వనపర్తికి బయలుదేరారు. నర్సింహా బైక్ నడుపుతుండగా.. శ్రీనివాస్ వెనక కూర్చున్నాడు. వీరి బైక్ మండల పరిధిలోని గండిగూడ వద్ద ఆగి ఉన్న బోర్‌వెల్ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సింహాకు తీవ్ర గాయాలవడంతో చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల విచారణలో బైక్ దొంగతనం వెలుగు చూసింది. మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ అస్తవ్యస్తం!

- అత్తాపూర్–బాపూఘాట్ రహదారిలో నిత్యం నరకయాతనే
- పెరిగిపోతున్న వాహనాల రాకపోకలు
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు శూన్యం
- వాహనదారులకు తప్పని పరేషాన్



అత్తాపూర్–బాపూఘాట్ ప్రధాన రహదారిపై వాహనాల రద్దీ

అత్తాపూర్: నగరంలో జనాభా పెరుగుతోంది. తదనుగుణంగా వాహనాల రద్దీ కూడా పెరుగుతోంది. అయితే పెరుగుతున్న ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు... వాహనదారుల ఇబ్బందులను పరిష్కరించేందుకు సంబంధిత అధికార యంత్రాంగం పెద్దగా చర్యలు తీసుకోవడం లేదంటూ వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- అత్తాపూర్ నుంచి బాపూఘాట్ వెళ్లే ప్రధాన రహదారిలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారవుతోంది. వాహనాలను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసి ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో లంగర్‌హౌస్ బాపూఘాట్ ప్రాంతంలో దివంగత సీఎం డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో బ్రిడ్జి నిర్మించడంతో పాటు ఈ రోడ్డు మార్గాలను అనుసంధానం చేశారు.
- అత్తాపూర్ మూసీ పరీవాహక ప్రాంతలో నూతనంగా రోడ్డు మార్గాన్ని అనుసంధానం చేయడంతో తాండూర్, చేవెళ్ల, వికారాబాద్, పరిగి, మొయినాబాద్, శంకర్‌పల్లి, నార్సింగి తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు.
- మూసీ పరీవాహక ప్రాంత రహదారి గుండా వచ్చే వాహనాలు లంగర్‌హౌస్ వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరు వాహనదారులు పోటీపడుతూ తమ వాహనాలను నడుపుతుండటంతో ప్రమాదాల బారినపడుతున్నారు.
- ఈ రెండు మార్గాల నుంచి వచ్చే వాహనదారులకు సిగ్నల్స్ లేని కారణంగా ఎటువైపు వాహనం వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో లంగర్‌హౌస్ మూసీ చౌరస్తా ప్రమాదకంగా మారింది. ఈ బ్రిడ్జి సమీపంలో వచ్చే టిప్పర్లు, లారీల కారణంగా సమస్య మరింత జఠిలం అవుతున్నదని వాహనదారులు వాపోతున్నారు.




సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలి



అత్తాపూర్ నుంచి లంగర్‌హౌస్ వెళ్లే వాహనదారులు అత్తాపూర్ మూసీ ప్రధాన రహదారి నుంచి లంగర్‌హౌస్ వైపు వెళ్లే వాహనదారులు లంగర్‌హౌస్ బ్రిడ్జి సమీప చౌరస్తాలో ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనాల రద్దీని బ్రిడ్జి ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ట్రాఫిక్ అధికారులపై ఉంది. ఈ చౌరస్తాలో సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తూ ట్రాఫిక్ అధికారులు, సిబ్బందిని నియమించాలి.

– రాచూరి రాజశేఖర్, హైదర్‌గూడ

పటిష్ట చర్యలు తీసుకుంటాం



పెరిగిపోతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ఆయా మార్గాలలో రోడ్లను అనుసంధానం చేస్తూ ప్రమాదాలు జరుగకుండా చూస్తున్నాం. అత్తాపూర్ మూసీ పరీవాహక ప్రాంతం నుంచి నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్డులో వాహనాల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నది. ఈ చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. సిగ్నల్స్‌ను ఏర్పాటు చేస్తాం.

– రాజేందర్‌గౌడ్, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

జీఎస్‌టీ అధికారుల బెదిరింపులు తాళలేక వ్యాపారి ఆత్మహత్య



మల్లికార్జున్ (ఫైల్)

మణికొండ: చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ) చేసిన మోసం, జీఎస్‌టీ అధికారుల బెదిరింపులకు జడిసి ఓ వ్యాపారి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం గండిపేటలో జరిగింది. మృతుడి మిత్రుడు, భాగస్వామి బండ్లగూడకు చెందిన మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం... లంగర్‌హౌస్‌కు చెందిన మల్లికార్జున్(40)తో కలిసి త్వరగా, తక్కువ ధరలో విక్రయించే వస్తువులు (ఎఫ్‌ఎంసీజీ) అమ్మే వ్యాపారం ఎంఎం ఎంటర్‌ప్రైజెస్ పేరుతో చేస్తున్నామన్నారు. తమ వ్యాపారానికి జీఎస్‌టీ చెల్లింపులు చేయాలని కర్మాన్‌ఘాట్‌కు చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ వెంకటాపురం కుమార్‌ను నియమించుకున్నామన్నారు. అతనికి 2021 నుంచి 2024 వరకు జీఎస్‌టీ చెల్లించాలని అతను చెప్పినంత డబ్బు ఎప్పటికప్పుడు పంపారు. అయినా అతను సకాలంలో, సరైన పద్ధతిలో చెల్లించలేదు. ఆ విషయం తెలిసి వారు మార్చి 2024 నుంచి యాసీన్ అనే మరో సీఏను నియమించుకున్నారు. అయినా మల్లికార్జున్‌తో పాటు అతని భాగస్వామి మల్లేష్‌లకు గత నెల 29వ తేదీన జీఎస్‌టీ అధికారుల నుంచి రూ. 63,15,077లు చెల్లించాలని ఫోన్‌లు, ఈ మెయిల్‌లు వచ్చాయి. దాంతో మల్లేష్ చార్టర్డ్ అకౌంటెంట్ చేసిన మోసంపై అదే రోజు రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా గురువారం సాయంత్రం మల్లికార్జున్ గండిపేటకు వచ్చి తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలు భరించలేక ఆర్తనాదాలు చేయటంతో చుట్టుపక్కల ఉన్న వారు వెళ్లి మంటలను ఆర్పి ఆస్పత్రికి తరలించారు. 80 శాతం కాలిన గాయాలతో చికిత్స పొందుతూ అతను మృతిచెందాడు. మల్లేష్, మృతుని సోదరుడు ఉమేష్‌లు మల్లికార్జున్ మృతికి సీఏ కుమార్ సకాలంలో జీఎస్‌టీ చెల్లింపులు చేయకపోవటం, వారి నుంచి ఫోన్‌లు, మెయిల్‌లు రావటంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.